క్లుప్తంగా

రావణబ్రహ్మ వాహనంపై మార్కండేశ్వరుడు

మార్కాపురం టౌన్: పట్టణంలోని శ్రీజగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో శనివారం రావణబ్రహ్మ వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. మహాశివ రాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారు అమ్మవారితో కలిసి రోజూ వివిధ వాహనాలపై భక్తులకు దర్శనమిస్తున్నారు. ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో స్వామి, అమ్మవార్లను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి నాలుగు మాఢ వీధుల్లో ఊరేగించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం టౌన్: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో వెలసిన శ్రీదేవీ భూదేవీ సమేత అమలక లక్ష్మీనారాయణ స్వామి వారి (వెంకచ్చమ్మ) దేవస్థానంలో ఈ నెల 2 నుంచి 62వ హరేరామ నామ సప్తాహ బ్రహ్మోత్సవాలు ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ డీవీ కృష్ణారెడ్డి శనివారం తెలిపారు. బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడహక్ కమిటీ సభ్యులు జి.వెంకటరెడ్డి, వై.సత్యనారాయణరెడ్డి, సీహెచ్ మల్లారెడ్డి, ఎస్.యోగిరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రామకృష్ణ పరమహంస జయంతి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కాశినాయన కుంటలో శ్రీరామకృష్ణధ్యాన మందిరంలో రామకృష్ణ పరమహంస 190 వ జయంతిని శనివారం భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ ధ్యాన మందిరం నిర్వాహకుడు పి.హనుమంతారెడ్డి మాట్లాడుతూ భక్తి, జ్ఞాన వైరాగ్యాలను ప్రసాదించిన గొప్పవ్యక్తి రామకృష్ణ పరమహంస అని కొనియాడారు. సమాజంలో మరుగునపడిన ఆధ్యాత్మికతను వెలికితీసి అందరికీ జ్ఞాన బోధ చేసిన మహనీయుడు రామకృష్ణ పరమహంస అన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న దాత విజయ భాస్కర్‌రెడ్డి

బేస్తవారిపేట: స్థానిక త్రిలోక పుణ్యక్షేత్రంలోని లక్ష్మీ పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.లక్ష విరాళాన్ని పిటికాయగుళ్లకు చెందిన ఉప్పర్లపల్లి బాలిరెడ్డి కుమారుడు విజయ భాస్కర్‌రెడ్డి శనివారం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులకు వెంకటేశ్వరస్వామి ఆలయ కళ్యాణ మండపంలో ఏసీల ఏర్పాటుకు విరాళం అందజేశారు. ఆలయ పూజారి గిరిస్వామి చేతుల మీదుగా ఏసీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

కుళాయి కనెక్షన్లు ఆన్‌లైన్ చేయించుకోవాలి

పొదిలి: పట్టణ పరిధిలో మంచినీటి కొళాయి కనెక్షన్లు ఆన్‌లైన్ చేయించుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. కార్యాలయం సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఆన్‌లైన్ చేయని కనెక్షన్లను తొలగిస్తున్నారని చెప్పారు. గృహ యజమానులు కుళాయిలకు తగిన రుసుం చెల్లించి రెగ్యులర్ చేయించుకోవాలని తెలిపారు. అలా చేయకుంటే మున్సిపల్ చట్టం ప్రకారం అపరాధ రుసుం విధిస్తామని, సకాలంలో ఆన్‌లైన్ చేయించుకుని సక్రమమైన నీటి సరఫరాకు సహకరించాలని శ్రీనివాసరావు కోరారు.

మాదిగ అమరవీరుల త్యాగాలు మరువం



అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

మార్కాపురం: ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా అశువులు బాసిన మాదిగ అమరవీరుల త్యాగాలు మర్చిపోమని మాదిగ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు ఏలియా మాదిగ అన్నారు. ఉద్యమంలో అశువులు బాసిన అమరవీరుల చిత్రపటాలకు శనివారం పట్టణంలోని గడియార స్తంభం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్, ఎంవీపీహెచ్ సంఘాల నాయకులు పందిటి కాశీరావు, ఎనిబెర కిశోర్, బాబు, సంజీవయ్య, సురేష్, శ్యామ్, నగేష్ పాల్గొన్నారు.

నత్తే నయం..

- మూడు నెలల క్రితం సీసీ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం
- ముందుకు సాగని పనులు
- గృహాల్లోంచి బయటకు వచ్చేందుకు నానా అవస్థలు
- నిలిచిన వాహనాల రాకపోకలు
- నిత్యం రద్దీగా ఉండే రోడ్డు నిర్మాణంపై నిర్లక్ష్యం



గృహాల్లోకి కర్రలు పెట్టుకుని నడుస్తున్న గృహస్తులు

బేస్తవారిపేట:

స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు సీసీరోడ్డు విస్తరణ కోసం పాత సీసీరోడ్డుకు ఇరువైపులా పనులు మొదలు పెట్టారు. ఇరువైపులా ఒకేసారి పనులు చేసేందుకు ఎర్త్‌వర్క్ కోసం గుంతలు తీయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. మూడు నెలలు దాటినా ఎర్త్‌వర్క్, సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించలేదు. వర్షాలు పడినప్పుడు, ఎర్త్‌వర్క్ కోసం మట్టి తీసేటప్పుడు గృహాల ముందు ఉన్న కొన్నిచోట్ల మంచినీటి కొళాయి పైపులు పగిలిపోయాయి. నిత్యం పైపులైన్‌లు పగిలిపోతుండటంతో నూతన పైపులైన్ ఏర్పాటు చేశారు. మూడు నెలలుగా గృహాల నుంచి వయస్సు మళ్లినవాళ్లు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. కార్లు, స్కూల్ బస్‌లు, ట్రాక్టర్ల రాకపోకల సమయంలో ఎదురుగా ఏదైనా వాహనం వస్తే మార్జిన్ లేకపోవడంతో రాకపోకలు సాగించడంలేదు.

మెయిన్‌రోడ్డు నుంచి సందు రస్తాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మెయిన్‌రోడ్డు పక్కన సర్వీసురోడ్డు విస్తరణ కోసం లోతైన గుంతలు తీసి పెట్టడంతో సందు రస్తాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో దాదాపు 10 సందు రస్తాలకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనదారులు ఇంటికి దూరంగా ఎక్కడో వాహనాలు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెడ్డినగర్ వాసులు, వాహనదారులు, హైస్కూల్ విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగించే రద్దీగా ఉండే రోడ్డు నిర్మాణంపై కాంట్రాక్టర్ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడు. రోడ్డు నిర్మాణం తొందరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, గృహస్తులు కోరుతున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఇంటర్ విద్యార్థులు, తల్లిదండ్రులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని 5 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని శ్రీ సాధన జూనియర్ కళాశాల, రెడ్డీ మహిళా కళాశాల, కమలా జూనియర్ కళాశాల, గౌతమి జూనియర్ కళాశాలతో పాటు రాయవరం సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది కల్పించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కంభం: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 424 మందికి గాను 377 మంది హాజరయ్యారు. వాసవి జూనియర్ కళాశాలలో 450 మందికి గాను 405 మంది, గౌతమి జూనియర్ కళాశాలలో 403 మందికి గాను 388 మంది, తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్‌లో 308 మందికి గాను 296 మంది హాజరైనట్లు కస్టోడియన్ అధికారి టి.శివశంకర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను సీఐ మల్లికార్జున పరిశీలించారు.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాల, జీవనజ్యోతి జూనియర్ కళాశాల, సాహితి జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాల్లో 903 మంది విద్యార్థులకు గాను 792 మంది పరీక్ష రాయగా 111 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్ గా విజయ్‌శంకర్, మురళీకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి వ్యవహరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌గా అశోక్, సత్యరామిరెడ్డి వ్యవహరించారు.

రంగస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో నెమలిగుండ్ల రంగనాయకస్వామి

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. తొలుత స్వామి వారికి తలనీలాలు సమర్పించి ఆలయ సమీపంలోని నీటి గుండంలో స్నానాలు ఆచరించి అనంతరం స్వామి వారి దివ్యదర్శనం చేసుకున్నారు. భక్తులకు ఆర్య వైశ్య, గోపాలకృష్ణయాదవ, యోగివేయన రెడ్ల, కాశినాయన రెడ్ల, కాపుబలిజ అన్నదాన సత్రాల్లో అన్నసంతర్పణ చేశారు.

నేడు ఎస్పీ దామోదర్ పొదిలి రాక

పొదిలి: పొదిలికి ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదివారం వస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పాత పోలీస్‌స్టేషన్ భవనానికి మరమ్మతులు చేయించి సర్వాంగ సుందరంగా సర్కిల్ కార్యాలయం కోసం తీర్చిదిద్దారు. ఆ కార్యాలయాన్ని ఎస్పీ దామోదర్ ప్రారంభిస్తారని సీఐ పేర్కొన్నారు.

బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్

పొదిలి: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పొదిలికి చెందిన బత్తుల వెంకటేష్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నుంచి ఆయన నియామక పత్రం అందుకున్నారు. బీసీ యువజన ఉద్యమాల్లో చురుగ్గా పనిచేసిందులకు వచ్చిన ఈ పదవికి తగు న్యాయం చేస్తానని వెంకటేష్ యాదవ్ చెప్పారు. చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్ కోసం పోరాటాలు చేస్తామని, అందరినీ ఐక్యంగా అందులో భాగస్వాములను చేస్తామని వెంకటేష్ యాదవ్ చెప్పారు.

విద్యార్థినుల సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

బేస్తవారిపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా శనివారం బేస్తవారిపేటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్లకార్డులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కిశోర బాలికలకు చదువు ప్రాముఖ్యత, మహిళా సాధికారికతను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ కార్యకర్తలు షంషాద్ బి, పుల్లమ్మ, రాజేశ్వరి, కృష్ణావతి, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి చెక్కు అందచేత



చెక్కు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పొదిలి: మండంలోని సల్లూరులో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న జగన్నాథం రామకృష్ణ ఇటీవల మృతి చెందాడు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం రాత్రి రామకృష్ణ సంతాప సభ జరిగింది. యూనియన్ కోసం రామకృష్ణ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి నుంచి రూ.2 లక్షల చెక్కును రామకృష్ణ కుటుంబ సభ్యులకు అందజేశారు. అధ్యక్షుడు సాని కొమ్ము సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌హై, పెమ్మని బాలవెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముందు చూపుతో ఉపాధ్యాయుల కుటుంబాలను ఆదుకునేందుకు కుటుంబ సంక్షేమ నిధికి రూపకల్పన చేసిన యూటీఎఫ్ వ్యవస్థాపకుల్లో ఒకరైన రామిరెడ్డి సేవలు కొనియాడారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బి.బుజ్జిబాబు, జేవీవీ డివిజన్ కార్యదర్శి దేవ ప్రసాద్, పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

గొట్లగట్టులో గాలికుంటు టీకాలు



టీకా వేస్తున్న డాక్టర్ రాజ్యలక్ష్మి

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టులో శనివారం పశువైద్యాధికారి వి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లోసిస్ వ్యాధి టీకాల కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ 8 నెలల పెయ్యదూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు, పశువులన్నింటికి గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్నామని, ఈ నెల 30వ తేదీ వరకూ అన్నీ గ్రామాల్లో టీకాలు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పరిటాల సుబ్బయ్య, లక్ష్మణ, లక్ష్మి, ఏడుకొండలు, నారాయణరెడ్డి, వరలక్ష్మి, శ్రీనివాసులు, శివాజీనాయక్, కాసు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురం సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారావు

మార్కాపురం: మార్కాపురం జిల్లా, వెలుగొండ ప్రాజెక్టు జలాల సాధన, మెడికల్ కాలేజీ పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని వివిధ పార్టీల నాయకులు స్పష్టం చేశారు. శనివారం మార్కాపురంలోని ప్రెస్‌క్లబ్‌లో ప్రజాసంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు, సీపీఐ కార్యదర్శి అందె నాసరయ్య, సీహెచ్ శివప్రసాదరావు, ఎక్స్ సర్వీస్‌మెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, డాక్టర్ కందుల గౌతమ్ నాగిరెడ్డి, పాపిశెట్టి వీరయ్య హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో వెనుకబడిన పశ్చిమ ప్రకాశాన్ని కూటమి ప్రభుత్వం జిల్లాగా చేయాలని, వెలుగొండ ప్రాజెక్టును పూర్తిచేసి నీటిని విడుదల చేయాలని, మెడికల్ కాలేజీని త్వరగా పూర్తి చేయాలని కోరారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తేనే మార్కాపురం ప్రాంతంలో శాశ్వతంగా కరువు పోతుందన్నారు. ఈ ప్రాంత ప్రజల కోరికలను సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.

శివరాత్రికి ఆర్టీసీ ఆదాయం రూ.42.27 లక్షలు



మాట్లాడుతున్న డీఎం నరసింహులు

మార్కాపురం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మార్కాపురం ఆర్టీసీ డిపోకు 42,27,804 రూపాయల ఆదాయం వచ్చిందని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు తెలిపారు. శనివారం ఆయన డిపోలో మాట్లాడుతూ మొత్తం 80 బస్సులను శ్రీశైలం నడిపామని, 71,676 కిలోమీటర్లు ప్రయాణించగా 21,681 మంది ప్రయాణికులు శ్రీశైలానికి బస్సుల్లో వెళ్లారన్నారు. రెండు రోజుల పాటు బస్సులు నడిపామని, 377 ట్రిప్పులు తిప్పామని చెప్పారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చామని డీఎం చెప్పారు. ఆర్టీసీని ఆదరిస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఎనీ టైం మూత!

- ఏటీఎంలు పనిచేయక ఖాతాదారుల అవస్థలు



పనిచేయని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం



మూతపడిన కెనరా బ్యాంక్ ఏటీఎం

కంభం: నిత్యం రద్దీగా ఉండే కందులాపురం కూడలిలోని లింగారెడ్డి కాంప్లెక్స్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం నెల రోజులుగా పనిచేయడం లేదు. పక్కనే ఉన్న కెనరా బ్యాంక్ ఏటీఎం సైతం ఇటీవల కాలంలో మూత వేసి దర్శనమిస్తుండటంతో ప్రజలు నగదు తీసుకోవడం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అర్ధవీడు మండలం లోయలోని ప్రజలందరూ కందులాపురం కూడలిలో ఉండే ఏటీఎంలను ఎక్కువగా వినియోగిస్తుంటారు. ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, ఇతర కార్యాలయాలు కందులాపురం కూడలిలో ఉండటంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సైతం ఈ ఏటీఎంల పైనే ఆధార పడుతుంటారు. నెల రోజులుగా ఏటీఎం వద్ద పనిచేయడం లేదని బోర్డు దర్శనమిస్తోంది. ఎస్‌బీఐ అధికారులు స్పందించి ఏటీఎం మిషన్లను మరమ్మతు చేయించడంతో పాటును సెక్యూరిటీ గార్డును అందుబాటులో ఉంచాలని ఖాతాదారులు కోరుతున్నారు.

ప్రజా సమస్యలపై కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ ఐ.శ్రీనివాసులుకు సీపీఎం నాయకులు శనివారం ప్రజా సమస్యల పై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు టి.ఆవులయ్య మాట్లాడుతూ నగర పంచాయతీ ఆవిర్భవించి 14 సంవత్సరాలు అయినా నగరంలో ప్రధానంగా నీటి సరఫరా, పార్కులు, సరైన రోడ్లు, డ్రైనేజి వంటి ఇతర సమస్యలతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వచ్చే వేసవిలో నగర పంచాయతీలోని 20 వార్డుల్లో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని, వారికి నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కాశినాయనకుంట ఆవరణ చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి కొన్ని వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. అవి వాడుకలో లేక తుప్పు పట్టేందుకు సిద్ధమయ్యాయన్నారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు థామస్, నరసింహులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గజ్జలకొండలో తాగునీటికి కటకట



కుళాయి వద్ద బిందెలతో నీటి కోసం ఎదురు చూస్తున్న ప్రజలు

మార్కాపురం: మండలంలోని గజ్జలకొండ పంచాయితీ క్రిస్టియన్ పాలెంలో తాగునీటి సమస్య ఏర్పడింది. మూడు రోజులకోసారి వదులుతున్న నీరు సరిపోక పోవడంతో కాలనీ వాసులు నీటికోసం అవస్థలు పడుతున్నారు. సుమారు 600 కుటుంబాలు ఉన్న క్రిస్టియన్ పాలెంలో సక్రమంగా నీటి సరఫరా లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగు నెలల నుంచి ఈ పరిస్థితి ఏర్పడిందని కాలనీ వాసులు తెలిపారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటికోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి బిందెలతో కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నామని, అధికారులు ఇప్పటికైనా స్పందించి రోజూ నీటి సరఫరా చేయాలని, లేదా అదనపు బోర్లు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉమెన్ హెల్ప్ డెస్క్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఏఎస్సై సత్యనారాయణ

పొదిలి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మహిళా సహాయ కేంద్రం(ఉమెన్ హెల్ప్ డెస్క్)పై శనివారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఏఎస్సై సత్యనారాయణ సహాయక కేంద్రం పనితీరును వివరించారు. మహిళలు తాము చెప్పుకోలేని కొన్ని విషయాలను హెల్ప్ డెస్క్‌లో మహిళా పోలీసులకు చెప్పుకునే అవకాశం ఉందన్నారు. ఎటువంటి ఇబ్బందులు వచ్చినా స్టేషన్‌లోని సహాయక కేంద్రం ద్వారా మహిళలు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అనంతరం స్టేషన్‌లోని పలు విభాగాల గురించి, పనితీరు గురించి వివరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సైదుబాబు

మార్కాపురం టౌన్: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్సై సైదుబాబు సూచించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జరుగుతున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శనివారం పట్టణ పోలీసుస్టేషన ఆవరణలో విద్యార్థినులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ చేసినా, ప్రయాణాల్లో ఇబ్బంది పెట్టిన వెంటనే పోలీసులకు ఫోన్ చేయాలని సూచించారు. గుర్తుతెలియని ఫోన్ నంబర్లను ఎత్తవద్దని, లింకులు ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు మాట్లాడుతూ సెల్‌ఫోన్‌ను చదువు కోసమే ఉపయోగించుకోవాలని సూచించారు.